లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

# పేద ప్రజలకు అండగా ప్రభుత్వం

- భూపాలపల్లి ఎమ్మెల్యే సత్యనారాయణరావు
- లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 26 : పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో కల్యాణలక్ష్మి పథకం కింద రూ.1,00,116తో పాటు తులం బంగారం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవో రమాదేవి, మున్సిపల్ కౌన్సిలర్లు ముంజాల రవీందర్ గౌడ్, దాట్ల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**పడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు**

భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని శ్రీ హరిపుత్ర చతుర్రూప అయ్యప్ప స్వామి దేవాలయంలో మంగళవారం జరిగిన మహా మండల పడిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే దంపతులు గండ్ర సత్యనారాయణరావు-పద్మ హాజరై భక్తులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నియోజకవర్గ ప్రజలు సుఖ శాంతులతో జీవించాలని వారు కోరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# ఇరాన్‌లో తాడ్వాయి వాసి గల్లంతు

- సముద్రంలో మునిగిన షిప్
- ఆచూకీ కోసం గాలింపు చర్యలు
- కుమారుడి సమాచారం తెలుసుకోవాలని ప్రభుత్వానికి తల్లిదండ్రుల వినతి

తల్లిదండ్రులు, సోదరితో శ్రీమాన్

ములుగురూరల్, డిసెంబర్ 26 : ములుగు జిల్లా తాడ్వాయి మండలం బయ్యక్కపేటకు చెందిన వ్యక్తి ఇరాన్ దేశంలోని సముద్రంలో గల్లంతయ్యాడు. ఇందుకు సంబంధించిన వివరాలను గుర్రం శ్రీమాన్ తండ్రి సమ్మిరెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపాడు. బీటెక్ పూర్తయిన శ్రీమాన్ జైపూర్ కన్‌స్ట్రక్షన్ పరిధి షిప్‌లో ఉద్యోగం వచ్చిందని నవంబర్ 22న ఇరాన్ వెళ్లాడు. కాగా, శుక్రవారం ఏడుగురితో పోయెట్ సముద్ర మార్గాన ట్రాన్స్‌పోర్ట్ చేస్తుండగా రాత్రి 8గంటలకు షిప్ సముద్రం మధ్యలో గల్లంతైంది. ఈ విషయాన్ని శ్రీమాన్‌తో పనిచేసే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తమ బంధువుకు మంగళవారం సమాచారం ఇచ్చాడని సమ్మిరెడ్డి తెలిపాడు. ఈ విషయమై సంబంధిత కంపెనీ ఉద్యోగికి ఫోన్ చేయగా షిప్ గల్లంతైన విషయం వాస్తవమేనని, రెస్క్యూ టీమ్ ఏడుగురిలో ముగ్గురిని కాపాడగా, ఒకరి మృతదేహం లభ్యమైందని, తన కుమారుడు శ్రీమాన్‌తో పాటు షిప్ కెప్టెన్ ఆచూకీ తెలియలేదని, వారి ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పాడన్నారు. మంత్రి సీతక్కతో పాటు జడ్పీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి దృష్టికి తీసుకెళ్లడంతో పాటు కలెక్టర్‌కు కలిసినట్లు సమ్మిరెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీకి సైతం ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ప్రభుత్వం తన కొడుకు పూర్తి సమాచారం తెలుసుకోవాలని బాధితుడు ప్రభుత్వాన్ని కోరుతున్నాడు. కాగా, శ్రీమాన్ తల్లి గుర్రం రమ ప్రస్తుతం బయ్యక్కపేట సర్పంచ్‌గా ఉన్నారు.

# పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

మహదేవపూర్, డిసెంబర్ 26 : మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామాల్లో డ్రై డే కార్యక్రమం నిర్వహించి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మురుగు నీటి వల్ల కలిగే అనర్థాలను ప్రజలకు వివరించారు. డ్రమ్ముల్లో, గోళాల్లో నిల్వ ఉన్న నీటిని వైద్య సిబ్బంది పారబోశారు. కరోనా మళ్లీ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు.

కార్యక్రమంలో డాక్టర్ విజయ్ కుమార్, హెల్త్ సూపర్ వైజర్ మాషూక్ అలీ, హెల్త్ అసిస్టెంట్ సత్యనారాయణ. ఏఎన్ఎంలు కనకదుర్గ, శైలజ, శ్రీలత, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జాతరలో పోలీసుల పాత్ర కీలకం

- భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి
- అన్ని శాఖలతో సమన్వయం చేసుకోవాలి
- ప్రభుత్వ హామీలను అమలు చేస్తాం
- ములుగు ఎస్పీ గౌష్‌ఆలం
- పోలీసు అధికారులతో మేడారం జాతర, అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్‌ఆలం

ములుగురూరల్, డిసెంబర్ 26 : మేడారం జాతరలో పోలీసుల పాత్ర కీలకమైనదని ఎస్పీ గౌష్‌ఆలం అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఎస్పీ జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాతరలో ముఖ్యంగా పార్కింగ్ స్థలాలు, రోడ్ల పనుల పునరుద్ధరణ, కల్వర్టుల పటిష్టత, బందోబస్తు, సెక్షన్ వారీగా బారికేడింగ్, సరిపడా కమ్యూనికేషన్ పరికరాలు, సీసీ టీవీ నిఘాతో పాటు మెస్ పాయింట్లు, కొత్త హోల్డింగ్ ప్రాంతాలు, వివిధ విభాగాలతో సమన్వయంలో పోలీసులు తమ విధులు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం ఒక్కో అధికారికి విధులను వర్గీకరించారు. ప్రజాప్రతినిధులతో చర్చించి వారి సహకారంతో జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ ప్రాధాన్యతలు, వాగ్దానాల అమలు, పరిపాలనను ప్రజలకు చేరువ చేయడం, అభివృద్ధి, సంక్షేమంపై సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ ఇచ్చిన మార్గదర్శకాలతో ప్రజల నుండి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా విధులు నిర్వర్తించాలని పోలీస్ అధికారులకు సూచించారు.

ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీ రవీందర్, ములుగు, పస్రా, ఏటూరునాగారం సీఐలు, ఆర్ఐ అడ్మిన్, ఆర్ఐ, ఎస్సైలు పాల్గొన్నారు.

కాటారం : పూజలు చేస్తున్న ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ఏటూరునాగారం : పూజలో పాల్గొన్న టాస్క్ ఫోర్స్ సీఐ దేవేందర్ దంపతులు

# వైభవంగా దత్త జయంతి

- ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో ఘనంగా వేడుకలు
- భారీగా హాజరై పూజలు చేసిన భక్తులు
- పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే సత్యనారాయణరావు

కాళేశ్వరం : దత్తాత్రేయ స్వామి వారి పూజల్లో భక్తులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : కాటారం మండలం ధన్వాడలోని దత్తాత్రేయస్వామి ఆలయంలో దత్త నవరాత్రి వేడుకలు మంగళవారం ముగిశాయి. ఈ సందర్భంగా దత్త జయంతి వేడుకలను వేద పండితులు కృష్ణమోహన్, లవకుశ్, ప్రవీణ్, రాజు, శ్రీనివాస్ నిర్వహించగా రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు-శైలజ రామయ్యర్ దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు 108 దివ్య జ్యోతులతో స్వామి ఊరేగింపు నిర్వహించారు. మంత్రి శ్రీధర్‌బాబు తల్లి జయశ్రీ, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ దుద్దిళ్ల శ్రీనుబాబు దంపతులు హోమం నిర్వహించారు. వేలాది మంది భక్తులకు అన్నదానం చేయగా, పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గణపురం మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో నిర్వహించిన దత్త జయంతి వేడుకల్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వినయ్ శర్మ ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెట మామిండ్ల మల్లికార్జున్‌గౌడ్, మునిగాల రమేశ్, ఆరుముళ్ల ఎల్లస్వామి, తిక్క సంపత్, సదాకర్, మహేశ్, రాజు తదితరులున్నారు. అలాగే పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి అనుబంధ దత్తాత్రేయ స్వామి ఆలయంలో మంగళవారం దత్త జయంతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 10.30 గంటలకు ఆలయంలో అర్చకులు కృష్ణమూర్తి శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, పాలాభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంపీటీసీ మమత, సర్పంచ్ వసంత, ఆలయ ఈవో మహేశ్ ధర్మకర్తలు అడప సమ్మయ్య, రాంరెడ్డి, శ్యామ్ సేట్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో మంగళవారం దత్తాత్రేయుడి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదాన కార్యక్రమం చేపట్టగా 1,500 మంది పాల్గొన్నారు. వేడుకల్లో వరంగల్ టాస్క్ ఫోర్స్ సీఐ పెండ్యాల దేవేందర్ దంపతులు, అర్చకులు సుదర్శన్ శర్మ, ఆలయ కమిటీ అధ్యక్షుడు మెరుగు సత్యం, ప్రధాన కార్యదర్శి కాత యాదగిరి, ఉపాధ్యక్షుడు బచ్చు సతీశ్ సభ్యులు పాల్గొన్నారు. మంగపేట మండలం కమలాపురం శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయంలో అర్చకుడు రామసుబ్బారావు ఆధ్వర్యంలో పూజలు, స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సిద్దంశెట్టి లక్ష్మణ్‌రావు, కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా అయ్యప్ప అరట్టోత్సవం

త్రివేణి సంగమంలో ప్రత్యేక అభిషేకాలు

శోభాయాత్రలో అయ్యప్ప దీక్షాపరులు

కాటారం, డిసెంబర్ 26 : అయ్యప్ప స్వాముల శరణు ఘోష.. మంగళవాయిద్యాలు.. మహిళల మంగళహారతుల నడుమ శ్రీ ఆనంద ధర్మశాస్త అయ్యప్ప స్వామి అరట్టోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని రథంలో మండల కేంద్రంలోని పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు, భక్తులు అయ్యప్ప స్వామికి మంగళహారతులతో నీరాజనం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాళేశ్వరానికి తరలి వెళ్లి పవిత్ర త్రివేణి సంగమంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తిని తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో పూజారులు భాను ప్రసాద్ శర్మ, ఆలయ వ్యవస్థాపకుడు బచ్చు అశోక్ గుప్తా, ఆలయ కమిటీ అధ్యక్షుడు బచ్చు ప్రకాశ్, గురుస్వాములు పీచర రామకృష్ణారావు, బొమ్మ ప్రభాకర్, అయిత వెంకన్న, చీమల రాజు, జక్కు మొగిలి, ముస్కమల్ల సత్యనారాయణ, జక్కు రాకేశ్, మేకల అశోక్, గద్దె రవీందర్, దండ్రు రాజయ్య, కొట్టె ప్రభాకర్, పసుల మొగిలి, మాలధారణ స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో ఆరోగ్య మహిళ వివరాలపై ఆరా తీస్తున్న డీఎంహెచ్‌వో అల్లం అప్పయ్య

# ఆరోగ్య మహిళ ను సద్వినియోగం చేసుకోవాలి

## ములుగు డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య

వెంకటాపూర్, డిసెంబర్ 26 : మహిళలు ఆరోగ్య మహిళను సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో అల్లె అప్పయ్య అన్నారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో మంగళవారం ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ప్రభుత్వ దవాఖానల్లో 11 రకాల పరీక్షలు చేసుకోవచ్చని, 24 గంటల్లో రిపోర్టులు వస్తాయన్నారు. కరోనా విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ మాస్కులు ధరించాలని, మందులు సైతం అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆయన వెంట డాక్టర్ శ్రీకాంత్, సంఘమిత్ర, పీహెచ్ఎన్ శోభ, ఎల్‌టీ కృష్ణ, స్టాఫ్‌నర్సు జ్యోతి, సంధ్య, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

## అభివృద్ధి ఫలాలు పేదలకు అందాలి

భూపాలపల్లి రూరల్/ వెంకటాపురం(నూగూరు), డిసెంబర్ 26 : దేశ సంపద, అభివృద్ధి ఫలాలు పేద ప్రజలకు అందాలని, అంతరాలు లేని సమాజ నిర్మాణమే ధ్యేయంగా సీపీఐ అనేక పోరాటాలు నిర్వహించిందని సీపీఐ భూపాలపల్లి, ములుగు జిల్లాల కార్యదర్శులు కొరిమి రాజ్‌కుమార్, తోట మల్లికార్జునరావు అన్నారు. మంగళవారం సీపీఐ 99వ వార్షికోత్సవ వేడుకలను భూపాలపల్లిలోని ఏఐటీయూసీ కొమురయ్య భవన్, వెంకటాపురంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పార్టీ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రభుత్వం పేద ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందించాలన్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి సోత్కు ప్రవీణ్ కుమార్, రమేశ్, సుగుణ, సతీశ్, జోసెఫ్, శ్రీకాంత్, వెంకటేశ్, లావణ్య, అచంట ప్రసాద్, రవీందర్, నర్సింహారావు, రాము, త్రినాద్, కృష్ణ, వెంకట్ పాల్గొన్నారు.

## 12న చలో పార్లమెంట్

ఏటూరునాగారం, డిసెంబర్ 26 : దేశ విద్యారంగ పరిరక్షణకు జనవరి 12న నిర్వహించే చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి జాగటి చిన్న కోరారు. విద్యా రంగాన్ని కాపాడాలని, నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 16 విద్యార్థి సంఘాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటాయని తెలిపారు. దేశంలోని కేంద్ర విద్యాలయాల్లో మౌలిక సదుపాయాలు కల్పించకుండా బహుళ జాతి కంపెనీల ప్రైవేట్ యూనివర్సిటీలను ఆహ్వానిస్తూ ప్రభుత్వ యూనివర్సిటీలను నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు కావేరి బైరేశ్, మందపల్లి స్వామి, కోయిల బాలేశ్వర్, ఆతుకూరి సింహాద్రి పాల్గొన్నారు.

# కాళేశ్వరంలో గోదావరికి హారతి

హారతి ఇస్తున్న అర్చకులు

కాళేశ్వరం, డిసెంబర్ 26 : పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం ఆధ్వర్యంలో గోదావరి మాతకు ప్రత్యేక హారతి ఇచ్చారు. మంగళవారం పౌర్ణమి కావడంతో ఆలయం నుంచి మంగళ వాయిద్యాలతో గోదావరి వద్దకు వెళ్లి నదీ మాతకు పూలు, పండ్లు, చీరె, పాలు పోసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హారతి ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మమత, సర్పంచ్ వసంత, ఈవో మహేశ్, ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, శ్యామ్ సేట్ తదితరులు పాల్గొన్నారు.

**కాలసర్ప పూజలు..**

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో మంగళవారం భక్తులు కాలసర్ప పూజలు చేశారు. ముందుగా గోదావరిలో స్నానాలాచరించి నదీ మాతకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఆవరణలో కాలసర్ప పూజలు చేశారు. అలాగే కొంత మంది భక్తులు శని పూజలు చేశారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్నారు. వివిధ పూజల ద్వారా సుమారు రూ. 3 లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు.

**ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి పూజలు**

కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయంలో రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు సతీమణి, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర స్వామికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఆశీర్వచనం అందజేసి స్వామి వారి శేష వస్త్రాలతో సన్మానించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024, 9640400073.
NT-314383

అమ్మబడును

★సుబేదారి నందు గల గర్ల్స్ హాస్టల్ ఫర్నిచర్‌తోని అమ్మబడును. హాస్టల్లో ఉండి వంట చేయుటకు వంట మనిషి కావలెను. (లేడీస్). సంప్ర: 8328620934.
NTW-00

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777618
9182777213
WARANAGAL
9182777556
9182777557
9182777558
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777554
JANGAON
9182777565

ఎస్పీకి వినతిపత్రం అందిస్తున్న మానవ హక్కుల కమిటీ సభ్యులు

## రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ములుగురూరల్, డిసెంబర్ 26 : జాతీయ రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్పీ గౌష్‌ఆలంకు జాతీయ మానవ హక్కుల కమిటీ సభ్యులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని యూటర్న్‌ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. డివైడర్ మధ్యలో పెద్ద చెట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడమే దీనికి కారణమన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కమిటీ రాష్ట్ర ఈసీ మెంబర్ చల్లూరి మహేందర్, జిల్లా అధ్యక్షుడు పాల్తియ రాజశేఖర్‌నాయక్, శనిగరపు ప్రవీణ్, పోరిక రాహుల్, నాగరాజు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఉద్యోగి మృతి

వెంకటాపురం (నూగూరు), డిసెంబర్ 26 : మండలంలోని కొండాపురం గ్రామ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉద్యోగి మృతి చెందాడు. ఎస్సై రేఖాశోక్ కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగుడెం జిల్లా సీ కొత్తూరు గ్రామానికి చెందిన సోడి శ్రీనివాస్ (50) కొండాపురం గ్రామ సమీపంలో బస్ దిగి నడుచుకుంటూ వెళ్తుండగా చర్ల వైపు నుంచి వస్తున్న బొలెరో వాహనం ఢీకొట్టింది.

ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలు కాగా భద్రాచలంలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## టీపీ జేఏసీ కమిటీ ఎన్నిక

ములుగురూరల్, డిసెంబర్ 26 : ములుగు జిల్లా కేంద్రంలో తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ(టీపీ జేఏసీ)ని రాష్ట్ర కో-కన్వీనర్ మైస శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. జిల్లా కన్వీనర్‌గా మంజాల భిక్షపతిగౌడ్, కో-కన్వీనర్లుగా తైనేని సరోజన, బొమ్మకంటి అశోక్, మున్ని మోడెం శంకర్, సాదం జయపాల్, నూనె శ్రీనివాస్, సభ్యులుగా గుండెమీది వెంకటేశ్వర్లు, ఝాన్సీ, పల్లెర్ల సతీశ్, ఓరుగంటి నవీన, దేవేందర్, రాము, గోగు, నర్సయ్య, అశోక్, తిరుపతి, రాజమౌళిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా భిక్షపతిగౌడ్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రజలకు మ్యానిఫెస్టోను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

వేడుకల్లో పాల్గొన్న విశ్రాంత ఉద్యోగులు

## పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలి

ఏటూరునాగారం, డిసెంబర్ 26 : పీఆర్‌సీని వెంటనే అమలు చేయాలని, విశ్రాంత ఉద్యోగులకు నగదు రహిత చికిత్స అమలు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పాల్తియా సారయ్య, ప్రధాన కార్యదర్శి బాసాని రామ్మూర్తి ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలోని నేతాజీ నగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో 41వ జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డీఆర్‌కూడా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం రిటైర్డు ఉద్యోగులను సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి బీ సేవ్లానాయక్, సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఆర్సీ మండల అధ్యక్షుడిగా సాంబయ్య

టేకుమట్ల, డిసెంబర్ 26 : జాతీయ మానవ హక్కుల కమిటీ మండల అధ్యక్షుడిగా మండలంలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన బీనవేని సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణాపూర్(వీ)కి చెందిన నాంపెల్లి వీరేశంను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు మొగులు భద్రయ్య, రాష్ట్ర ఈసీ మెంబర్ కోటగిరి సతీశ్‌గౌడ్ ఒక ప్రకటలో తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఎన్నికైన వారికి జిల్లా అధ్యక్షుడు దండ్రు కుమార్, తోట రాజయ్య, బండి సుదదర్శన్‌తో కలిసి నియామక పత్రాలు అందజేశారు.

## అదనపు ఎస్పీని కలిసిన యూత్ అధ్యక్షుడు శ్రీరామ్

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 26 : అదనపు ఎస్పీ నరేశ్‌కుమార్‌ను మంగళవారం భూపాలపల్లి పట్టణంలోని 17వ వార్డు బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు భూక్యా శ్రీరామ్ మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. జిల్లాలో గంజాయి, మత్తు పదార్థాల రవాణాను అరికట్టి యువత బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని ఆయన అదనపు ఎస్పీని ఈ సందర్భంగా కోరారు.

## అటవీ అధికారుల అదుపులో ఆరుగురు వేటగాళ్లు

తాడ్వాయి, డిసెంబర్ 26 : వణ్యప్రాణి (చుక్కల దుప్పి)ని వేటాడి మాంసాన్ని విక్రయిస్తున్న ఆరుగురు వేటగాళ్లను అటవీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సంఘటన మండలంలోని బోటి లింగాలలో మంగళవారం జరిగింది. లింగాల రేంజ్ అధికారి శ్రీరాములు కథనం ప్రకారం.. బోటి లింగాల గ్రామానికి చెందిన చెన్నూరి సతీశ్ మరో ఐదుగురు వ్యక్తులు అడవిలో క్లచ్ వైర్లతో ఉచ్చులు ఏర్పాటు చేసి చుక్కల దుప్పిని హతమార్చారనే సమాచారంతో సతీశ్ ఇంటి వద్ద సోదాలు చేయగా మాంసం ఉన్నట్లు గుర్తించామన్నారు. దీనిని స్వాధీనం చేసుకొని నిందితుడు సతీశ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తనతో పాటు అశోక్, ప్రకాశ్, విజయ్‌కుమార్, పోతరాజు, సుమన్ ఉన్నట్లు చెప్పాడు. దీంతో వారిని కూడా అదుపులోకి తీసుకుని ఉచ్చులు అమర్చిన ప్రాంతానికి వెళ్లి దుప్పి చర్మంతో పాటు వేటకు వినియోగించిన వస్తువులను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులు ఆరుగురిపై కేసు నమోదు చేశామన్నారు.

## అయోధ్య అక్షింతలతో శోభాయాత్ర

కాటారం, డిసెంబర్ 26 : అయోధ్య నుంచి మండలానికి చేరిన శ్రీరామ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ అక్షింతలతో మంగళవారం మండల కేంద్రంలో వీహెచ్‌పీ నేతలు, భక్తులు శోభాయాత్ర నిర్వహించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు దేవరాజు, మండల అధ్యక్షుడు జంగ సమ్మయ్య ఆధ్వర్యంలో అక్షింతలను ఊరేగింపుగా ఆంజనేయస్వామి ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం పలు గ్రామాలకు అక్షింతలను పంపించడానికి ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ కార్యదర్శి నరివెద్ది గోపాల్, ఎంపీటీసీ బాసాని రవి, ఊర వెంకటేశ్వర్‌రావు, సముద్రాల రామాచార్యులు, పల్నాటి బలరాం, రాజయ్య, సదయ్య, బొద్దున సతీశ్, సది, తంగళ్లపల్లి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా భాస్కర్‌నాయక్

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 26 : బంజారా గిరిజన విద్యార్థి సమాఖ్య జిల్లా అధ్యక్షుడిగా నంగావత్ భాస్కర్‌నాయక్‌ను ఎన్నుకున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు నేనావత్ శివనాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాలపల్లి పట్టణంలోని గొర్లవేడు తండాకు చెందిన భాస్కర్‌నాయక్ లంబాడీల, విద్యార్థుల సమస్యలపై చురుకుగా పోరాడుతున్నందున జిల్లా అధ్యక్షుడిగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా భాస్కర్ నాయక్ మాట్లాడుతూ తన ఎన్నికకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.